
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రంగారెడ్డి

5 జిల్లా వార్తలు

బుధవారం 5 మార్చి 2025



రంజాన్ వేళలు

ఇఫ్తార్-బుధవారం
సాయంత్రం - 6.30

సహర్- గురువారం
ఉదయం - 5.09

ఇంటర్మీడియట్ పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం పకడ్బందీగా ఏర్పాట్లు చేసింది. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు కొనసాగేలా విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకున్నారు. నేడు మొదటి సంవత్సరం పరీక్షలు ప్రారంభం కానుండగా, సెకండియర్ గురువారం నుంచి జరగనున్నాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. ఈ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 185 కేంద్రాలు ఏర్పాటు చేయగా.. 1,58,804 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి ఉదయం 9.05 గంటల వరకు అనుమతించనున్నారు.



హాల్‌టికెట్‌పై క్యూఆర్ కోడ్..

విద్యార్థులు పరీక్షా కేంద్రం ఎక్కడ ఉందనేది సులువుగా తెలుసుకునేందుకు ఇంటర్మీడియెట్ విద్యా మండలి హాల్ టికెట్లపైన క్యూఆర్ కోడ్‌ను ముద్రించింది. దానిని స్కాన్ చేస్తే పరీక్షా కేంద్రం అడ్రస్ తెలుస్తుంది. ఈసారి కూడా ఎగ్జామ్ సెంటర్ లోకేటర్ యాప్ అందుబాటులోకి తీసుకువచ్చారు. ఆండ్రాయిడ్ ఫోన్‌లో ప్లేస్టోర్‌లోకి వెళ్లి ఐపీఈ ఎగ్జామ్ సెంటర్ లోకేటర్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని నో యువర్ ఎగ్జామ్ సెంటర్ ఆప్షన్‌లో కాలేజ్ కోడ్, విద్యార్థి వివరాలు టైప్ చేస్తే పరీక్షా కేంద్రం ఎక్కడ ఉందనేది తెలియనుంది. .

విజయోస్తు..!

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

రంగారెడ్డి అర్బన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ పరీక్షలకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. జిల్లా వ్యాప్తంగా 1,58,804 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇంటర్ ఫస్టియర్ పరీక్షలకు 80,409 మంది, సెకండియర్ పరీక్షలకు 78,395 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ఇందుకోసం 185 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. అందులో రూరల్ పరిధిలో 38 కేంద్రాలు, అర్బన్ ప్రాంతాల్లో 147 పరీక్ష కేంద్రాలున్నాయి. వీటిలో ప్రభుత్వపరంగా 18 సెంటర్లు, ఎయిడెడ్ ఒకటి, 5 స్కూల్స్, మైనారిటీ జూనియర్ కాలేజీలు 5, ట్రైబల్ వెల్ఫేర్ ఒకటి, సోషల్ వెల్ఫేర్ కాలేజీలు 7, మోడల్ స్కూల్ 6, కేజీబీవీ 1, బీసీ వెల్ఫేర్ కాలేజీ ఒక పరీక్ష కేంద్రం ఉంది. ఒక్కో గదిలో విస్తీర్ణం ఆధారంగా 20 నుంచి 40 మంది వరకు

మిగతా 8వ పేజీలో...



కేంద్రాల వద్ద మౌలిక సౌకర్యాలు

ఎండలు తీవ్రరూపం దాల్చిన నేపథ్యంలో పరీక్షా కేంద్రాల వద్ద తాగునీటి సదుపాయం కల్పించడంతో పాటు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేశారు. విద్యార్థుల్లో ఎవరైనా అస్వస్థతకు గురైతే సత్వరమే స్పందించి వైద్య సేవలు అందించేందుకు వీలుగా ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లను నియమించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లతో పాటు అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు. పరీక్ష కొనసాగే సమయంలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా ముందస్తు జాగ్రతలు తీసుకుంటున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 200 మీటర్ల దూరం వరకు నిషేధాజ్ఞలు అమలయ్యేలా చర్యలు చేపట్టారు. అలాగే జిరాక్స్ దుకాణాలు, కంప్యూటర్ సెంటర్లు మూసి ఉంచాలంటూ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడిపించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

- పకడ్బందీ ఏర్పాట్లు చేసిన అధికారులు
- 185 కేంద్రాలు.. 1,58,804 మంది విద్యార్థులు
- సీసీ కెమెరాల నిఘా నీడలో ఎగ్జామ్స్
- ఉదయం 9.05 గంటల వరకు కేంద్రాల్లోకి అనుమతి
- క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే పరీక్షా కేంద్రం అడ్రస్



శంకర్‌పల్లి మోడల్ స్కూల్లో హాల్‌టికెట్ల నంబర్లు వేస్తున్న సిబ్బంది

పకడ్బందీ ఏర్పాట్లు

జిల్లాలో ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాం. విద్యార్థులు ధైర్యంగా పరీక్షలు రాయాలి. విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలి. ఆలస్యంగా వచ్చి ఒత్తిడికి గురికావొద్దు. ఉదయం 8.45 గంటల్లోగా కేంద్రాలకు చేరుకోవాలి. విద్యార్థులను 9.05 గంటల వరకు పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తాం. ఆ తర్వాత ఆలస్యంగా వస్తే లోపలికి అనుమతించం.

- వెంక్యానాయక్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి



సభలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

ఫార్మాసిటీ, ఫ్యూచర్‌సిటీల పేరుతో భూములు

లాక్కోవడం దారుణం

ఏ సిటీ వద్దు.. పేదలకు భూములు పంచి ఆదుకోండి

- ఆరు గ్యారెంటీలు అమలు కావడం లేదని సీఎం తెలుసుకోవాలి
- ప్రజలకు న్యాయం చేయకపోతే సీఎం ఇంటిని ముట్టడిస్తాం
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ
- మేడిపల్లిలో పోరుబాట ప్రారంభం

యాచారం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : ఫార్మాసిటీ, ఫ్యూచర్‌సిటీల పేరుతో నిరుపేదల భూములు లాక్కోవడం దారుణమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. యాచారం, కందుకూరు మండలాల ప్రజలకు ఏ సిటీ అవసరం లేదని, నిరుపేదలకు భూములు పంచి ఆదుకోవడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారించాలని డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు సీపీఎం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన పోరుబాట కార్యక్రమాన్ని మంగళవారం రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మేడిపల్లి గ్రామంలో జాన్‌వెస్లీ ప్రారంభించారు. అనంతరం గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ ఫార్మాసిటీ కోసం యాచారం మండలంలోని మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాలలో 9వేల ఎకరాల భూములు తీసుకోవడంతో వందలాది మంది పేదలు వీధిన పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. ఏడున్నరేళ్లుగా మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాలలో 2200 ఎకరాల భూములను నిషేధిత జాబితాలో పెట్టడం ఎంత వరకు న్యాయమని ప్రభుత్వంపై మండిపడ్డారు. పేదలకు తక్షణమే భూములు పంచకపోతే సీఎం రేవంత్ ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఫార్మా భూసేకరణలో జరిగిన కుంభకోణంపై తక్షణమే న్యాయ విచారణ చేయించి దోషుల చట్టపరంగా కోరారు. ఈ ప్రాంతానికి ఎలాంటి సంబంధం లేనివారికి అక్రమంగా ప్రజాధనం అందించినట్లు తన దృష్టికి వచ్చిందని తెలిపారు. తాము అధికారంలోకి రాగానే ఎల్ఆర్ఎస్ రద్దుచేసి పేదలను ఆదుకుంటామని గతంలో కాంగ్రెస్ నాయకులు హామీ ఇచ్చారని, నేడు అదే ఎల్ఆర్ఎస్ పేరుతో జనం జేబులు ఖాళీ చేస్తున్నారన్నారు. జనాలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి జనం బుద్ధి చెబుతారన్నారు. త్వరలో మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాలలో మరోమారు పర్యటించి జరిగిన అవినీతిపై ప్రభుత్వానికి వివరిస్తామన్నారు. ఆరు గ్యారెంటీలు ఎక్కడా అమలు కావడం లేదనే విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి పి.యాదయ్య, మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ్మ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.మధుసూదన్‌రెడ్డి తదితరులున్నారు.

మహిళా సంఘాలతో సమావేశం

ఫైబర్‌నెట్ పనితీరు పరిశీలన

హాజీపల్లి గ్రామంలో సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్‌రెడ్డి పర్యటన

షాద్‌నగర్‌రూరల్, మార్చి4(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండలం హాజీపల్లి గ్రామాన్ని మంగళవారం ముఖ్యమంత్రి స్పెషల్ సెక్రటరీ అజిత్‌రెడ్డి సందర్శించారు. కలెక్టర్ నారాయణరెడ్డితో కలిసి ముందుగా గ్రామ పంచాయతీకి చేరుకున్న ఆయన ఫైబర్ నెట్‌కు సంబంధించిన యంత్రాలను తనిఖీ చేశారు. అనంతరం పాఠశాలకు చేరుకుని ఫైబర్ నెట్ ద్వారా ప్రసారమవుతున్న టీ-సాట్ పనితీరును పరిశీలించారు. ఓ గృహాన్ని సందర్శించి సీఆర్‌టీవీ ద్వారా ప్రసారమయ్యే భక్తి గీతాలు, పాత గీతాలు తిలకించారు. రాధిక అనే మహిళ గృహంలో టీ- సాట్ ద్వారా పాఠాలు వింటున్న విద్యార్థి వద్దకు వెళ్లి మాట్లాడారు. అలాగే ఇంటింటికీ తిరిగి ఫైబర్ నెట్‌ను పరిశీలించారు. మేడపైన ఓ కుటుంబం గుడిసె వేసుకుని నివాసముంటూ అందులో టీవీ పెట్టుకుని నెట్ కనెక్షన్ తీసుకున్నారని తెలుసుకున్న అజిత్‌రెడ్డి, కలెక్టర్ అక్కడకు వెళ్లారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డీపీవో సురేష్ మోహన్, ఎంపీడీవో బన్సిలాల్, ఏపీవో జయంత్‌రెడ్డి, ఏపీఎం నగేష్ ఉన్నారు.



మేడపై వేసిన గుడిసెలో ఫైబర్ నెట్‌ను పరిశీలిస్తున్న అజిత్‌రెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి

కమ్మదనం గురుకులాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ నానాయణరెడ్డి ఆదేశించారు. మంగళవారం ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనం గురుకుల పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. వంట గది, మూత్ర శాలలు పరిశీలించారు. ప్రహరీ సక్రమంగా లేకపోవడంతో మరమ్మతులు చేయించాలని అధికారులను ఆదేశించారు. పాఠశాల పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని చెప్పారు. కిచెన్‌లో అన్నం వండే మిషన్ సరిగా పని చేయడం లేదని, దానిని వెంటనే మరమ్మతు చేయించాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట ఆర్డీఓ సరిత, తహసీల్దార్ పార్థసారథి ఉన్నారు.



మాట్లాడుతున్న శ్రీలత

ఉపాధి పనులను పారదర్శకంగా చేపట్టాలి

జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత

శంకర్‌పల్లి, మార్చి4(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులను పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత ఆదేశించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం 15వ సామాజిక తనిఖీ-ప్రజావేదిక కార్యక్రమం శంకర్‌పల్లి ఎంపీడీఓ వెంకయ్యగౌడ్ అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మంగళవారం జరిగింది. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి పనులకు సంబంధించి గ్రామస్థాయిలో రికార్డులు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. గ్రామాలలో నాటిన మొక్కలను 100శాతం బతికించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. శంకర్‌పల్లి మండలంలో 2023-24 సంవత్సరానికి గాను సుమారు రూ.2,42,17,421లతో 387 పనులు పూర్తి చేసినట్లు ఆమె వివరించారు. మండలంలో 4400 జాబ్‌కార్డులున్నట్లు ఆమె పేర్కొన్నారు. పలు గ్రామాలలో రిజిష్టర్లు నిర్వహణ సక్రమంగా లేదని, సిటిజన్ చార్టు బోర్డును ఏర్పాటు చేయలేదని తనిఖీ అధికారులు వెల్లడించారు. జాబ్ కార్డులను అప్‌డేట్ చేయడం లేదని, రైతు పొలాల్లో పనులు చేసినప్పుడు పానుపుస్తకాలు తీసుకోవడం లేదని తనిఖీ బృందం సమావేశం దృష్టికి తెచ్చారు. ఒక కుటుంబంలో ఒకే జాబ్ కార్డు ఇవ్వాల్సి ఉండగా రెండు మూడు ఇచ్చి నిబంధనలకు వ్యతిరేకంగా 180 పని దినాలను నమోదు చేసి డబ్బులు చెల్లించారని వెల్లడించారు. మహాలింగపురం గ్రామంలో జాబ్‌కార్డులు నిర్వహించకపోవడం, డిమాండ్ రిజిస్ట్రేషన్ పూర్తి స్థాయిలో లేదని వివరించారు. లలిత అనే మహిళ పని చేయకుండానే డబ్బులు మంజూరు చేశారని తనిఖీ అధికారులు సమావేశంలో తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సురేష్‌బాబు, ఏపీడీ చరణ్‌గౌతమ్, విజిలెన్స్ అధికారి కొండయ్య, అంబుడ్స్‌మెన్ సునీత, క్వాలిటీ కంట్రోల్ అధికారి సునీత, ఏపీఓ నాగభూషణం తదితరులు ఉన్నారు.



ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు

- తహసీల్దార్ రవీందర్ దత్
- గొల్లపల్లిలో అక్రమ నిర్మాణాల కూల్చివేత

7



ట్యాంకులోకి భగీరథ నీరు

7

- ఆనందం వ్యక్తం చేసిన బైర్యాన్‌పల్లి వాసులు



చేవెళ్ల బాలాజీ ఆలయంలో ముగిసిన జాతర

మహాశివరాత్రి సందర్భంగా చేవెళ్ల పట్టణ కేంద్రంలోని బాలాజీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించిన జాతర ముగిసింది. జాతర చివరి రోజు మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త దేవుని వామనాచార్యులు, సిబ్బంది, పూజారులు పాల్గొన్నారు. అనంతరం చేవెళ్ల మున్సిపల్ ప్రత్యేకాధికారి శ్రీధర్ ఆలయాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ పూర్వచందర్, రాఘవేందర్ తదితరులు ఉన్నారు.

చేవెళ్ల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి)

ఆ గ్రామంలో అన్నీ సమస్యలే!



పీర్లగూడ గ్రామ దారి

- ఇప్పటికీ అంబులెన్స్ వెళ్లలేని పరిస్థితి
- ప్రజలకు అందని ప్రభుత్వ పథకాలు
- పాలకులు పట్టించుకోరు..
- అధికారులు కన్నెత్తి చూడరు
- ఇదీ పీర్లగూడ దుస్థితి



ఏళ్లుగా రహదారి సౌకర్యం కరువు

షాద్‌నగర్ రూరల్, మార్చి4(ఆంధ్రజ్యోతి): ఫరూఖ్‌నగర్ మండలం చింతగూడ గ్రామ పంచాయతీకి అనుబంధ గ్రామమైన పీర్లగూడ సమస్యలతో సతమతమవుతోంది. ఆ ఊరి గురించి పట్టించుకునే నాయకులు, అధికారులు లేరు. కనీస వసతులకు దూరంగా గ్రామస్తులు జీవనం సాగిస్తున్నారు. అత్యవసరమైతే ఆ గ్రామానికి అంబులెన్స్ వెళ్లడానికి కనీసం దారి కూడా సరిగా లేదంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. హైదరాబాద్ రాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా పనిచేసిన బూర్గుల రామకృష్ణారావు స్వగ్రామమైన బూర్గుల గ్రామానికి కూతవేటు దూరంలో పీర్లగూడ గ్రామ ఉంటుంది. మూడు తరాలుగా 20 కుటుంబాలు ఇక్కడ జీవనం కొనసాగిస్తున్నాయి. బూర్గుల గ్రామానికి చెందిన నందారం కుటుంబీకుల పూర్వీకులు తమ పొలాలు ఇప్పుడున్న పీర్లగూడలో ఉండేవి. దూరం ఎక్కువగా ఉందని అక్కడ గుడిసెలు వేసుకుని వ్యవసాయ పనులు చేసుకున్నారు. రానురాను పీర్లగూడలో కుటుంబాల సంఖ్య పెరిగిపోయాయి. గ్రామంలో వసతుల లేమితో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు.

దశాబ్దాలుగా కాలినడకనే...

ఇప్పటి వరకు పీర్లగూడ గ్రామానికి సరైన రహదారి సౌకర్యం లేదు. దశాబ్దాలుగా రైలు

మిగతా 8వ పేజీలో...



సమస్యలు పరిష్కరించాలి

ఏళ్ల తరబడి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాం. ఎవరూ పట్టించుకోవడం లేదు. ఎన్నికల సమయంలోనే నాయకులు తమ గ్రామానికి వస్తారు. ఇకనైనా తమ గోడు పట్టించుకోవాలి.

నందారం సత్తయ్య- పీర్లగూడ





జాబ్‌మేళాకు భారీ స్పందన

కీసర రూరల్, మార్చి4(ఆంధ్రజ్యోతి): నాగారం మున్సిపల్ పరిధిలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాకు మంచి స్పందన లభించింది. ఐఫోన్ ఫ్యాక్స్ కంపెనీ అధ్వర్యంలో మున్సిపల్ పరిధి మహిళలకు జాబ్ మేళా నిర్వహించారు. 10వ తరగతి, బీటెక్, ఎమ్మెస్సీ, ఎంబీఏ, టెక్నీషియన్స్, పాలిటెక్నిక్ డిప్లమా చేసిన 500మంది మహిళలు మేళాలో పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి మాట్లాడుతూ.. మహిళలు ఇంటికే పరిమితం కాకుండా కుటుంబ ఆర్థికాభివృద్ధికి తమ వంతు కృషి చేయాలన్నారు. జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.450మంది నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మాజీ కౌన్సిలర్లు, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

పుష్కరిణిలో జారిపడి వ్యక్తి దుర్మరణం



మృతదేహాన్ని వెలికి తీస్తున్న సిబ్బంది



చేవెళ్ల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): స్నానానికి వెళ్లిన వ్యక్తి కాలు జారి పుష్కరిణిలో పడి మృతిచెందిన ఘటన మంగళవారం చేవెళ్లలో చోటుచేసుకుంది. ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. తాండూరు మండలం గోనూర్ గ్రామానికి చెందిన బుచ్చప్ప (45) బతుకుదెరువు కోసం చేవెళ్ల మండలం కిష్టాపూర్‌లోని అత్తగారింట్లో ఉంటూ కూలి పనిచేసుకుంటున్నాడు. చేవెళ్లలోని బాలాజీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి పుష్కరిణిలో బుచ్చప్ప స్నానానికి వెళ్లగా కాలుజారి పడిపోయాడు. అతడికి ఈత రాక మునిగిపోయాడు. స్థానికులు బయటకు తీసేలోపే చనిపోయాడు. పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. బుచ్చప్పకు భార్య శివలీల, పాప ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



జెండాను ఆవిష్కరిస్తున్న గజేందర్‌గౌడ్, రైతులు

రైతులు సంఘటితం కావాలి

షాబాద్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): పార్టీలకు అతీతంగా రైతులంతా సంఘటితం కావాలని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు గడిగె గజేందర్‌గౌడ్ అన్నారు. కిసాన్ సంఘ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం కేశవగూడలో కిసాన్ సంఘ్ జెండాను ఆవిష్కరించి ఆవుకు పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. రైతుల సమస్యలపై అధికారుల దృష్టికి తీసుకుపోయి, పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్‌సంఘ్ జిల్లా కమిటీ సభ్యుడు సత్యానారాయణరెడ్డి, మండల అధ్యక్షుడు యాదవరెడ్డి, మండల కార్యవర్గ సభ్యులు కృష్ణయ్య, పెంటయ్య, మల్లయ్య, చెన్నయ్య, చంద్రయ్యగౌడ్, వెంకట్‌రెడ్డి, నాగులపల్లి చెన్నయ్య, కుమార్, రైతులు పాల్గొన్నారు.

పేద విద్యార్థి చదువుకు చేయూత

తలకొండపల్లి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిపల్లికి చెందిన నిరుపేద విద్యార్థి ఉన్నత చదువుకు తలకొండపల్లి మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ చేయూతనందించారు. మీసాల సందీప్ అనే విద్యార్థి టీఎస్ రెడ్డినగర్‌లోని కృష్ణవేణి జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. విద్యార్థి ఆర్థిక ఇబ్బందులపై స్థానికులు వెంకటేశ్ దృష్టికి తెచ్చారు.
























ఎంపీ రాజేందర్‌కు వినతిపత్రం ఇస్తున్న సుదర్శన్, మహేందర్‌యాదవ్ తదితరులు

కట్టమైసమ్మ ఆలయాభివృద్ధికి సహకరిస్తా

మేడ్చల్ ప్రతినిధి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): శామీర్‌పేట పెద్ద చెరువు కట్టమైసమ్మ ఆలయ అభివృద్ధికి తోడ్పాటునందిస్తానని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మంగళవారం బీజేపీ జిల్లా నాయకుడు సుదర్శన్ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ నూతన అధ్యక్షుడు మహేందర్‌యాదవ్, మెంబర్లు ఎంపీ క్యాంప్ ఆఫీసుకు వెళ్లి కలిశారు. కట్టమైసమ్మ ఆలయ అభివృద్ధికి చేయూతనివ్వాలని ఎంపీ ఈటలను కోరారు. ఆలయ ఆవరణలో విద్యుత్ లైట్ల ఏర్పాటుకు సహకరించాలని ఎంపీకి వినతిపత్రం ఇచ్చారు. వారితో ఈటల మాట్లాడుతూ.. భక్తుల అవసరాలు తీర్చేలా ఆలయం వద్ద సౌకర్యాలు కల్పించేందుకు కృషిచేస్తామన్నారు.

ఎమ్మెల్యే చొరవతో నవాల్గకు మహర్దశ



సీసీ రోడ్డు పనుల ప్రారంభోత్సవంలో నర్సింహులుగౌడ్

బషీరాబాద్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని కాంగ్రెస్ బషీరాబాద్ మండలాధ్యక్షుడు కలాల్ నర్సింహులుగౌడ్ అన్నారు. మంగళవారం నవాల్గలో రూ.15లక్షల ఉపాధి నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా రోడ్ల అభివృద్ధికి రూ.300కోట్లు తెచ్చిన ఘనత ఎమ్మెల్యేకే దక్కిందన్నారు. ఈ నిధులతో తండాలు, ఎస్సీ కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలు చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మల్లమ్మ, పీఏస్ వెంకటేష్, గ్రామస్తులు కిష్టప్ప, లక్ష్మయ్యగౌడ్, గోపాల్, భీమ్‌శంకర్, సదానంద, నగేష్ తదితరులు పాల్గొన్నారు.



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద తొలగించిన పొదలు

ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పొదల తొలగింపు

కొత్తూర్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): కొత్తూర్ తహసీల్దార్ కార్యాలయం పక్కన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను కప్పేసిన పొదలను మంగళవారం ట్రాన్స్‌కో సిబ్బంది తొలగించారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను ముళ్లపొదలు కప్పేయడంతో షార్ట్‌సర్క్యూట్ అవుతుందనో, లేదా షాక్ కొడుతుందోనని ప్రజలు భయాందోళన చెందారు. దీనిపై స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు స్పందించలేదు. దీంతో ఈ సమస్యపై ఫిబ్రవరి 24న ఆంధ్రజ్యోతిలో 'రక్షణలేని ట్రాన్స్‌ఫార్మర్‌తో పొంచి ఉన్న ముప్పు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ అల్లుకున్న పొదలను సిబ్బందితో తొలగింపజేశారు. త్వరలోనే ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణగా ఫెన్సింగ్ వేస్తామని అధికారి తెలిపారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్‌శర్మ

ఔషధ మొక్కలకు పుట్టిల్లు భారత్

కడ్తాల్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): భారతదేశం అనాదిగా ఔషధ మొక్కలకు పుట్టినిల్లు అని ప్రముఖ ఆయుర్వేదిక్ శాస్త్రవేత్త, బెంగళూరు శంకర గురుకులం ఫౌండర్ డాక్టర్ చంద్రశేఖర్‌శర్మ అన్నారు. ఔషధ మొక్కల ఉపయోగాన్ని నిత్య జీవనంలో భాగం చేసుకోవాలని సూచించారు. కడ్తాల మండలం అన్మాస్‌పల్లి 'ది ఎర్త్ సెంటర్‌'లో మంగళవారం కౌన్సిలర్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి ఒడిలో ఒకరోజు కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. చంద్రశేఖర్ ఔషధ మొక్కల ప్రాధాన్యాన్ని వివరించారు. సీజీఆర్ చైర్‌పర్సన్ కె.లీలాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచ దేశాలకు ఆయుర్వేద ప్రాముఖ్యాన్ని చాటింది భారత్ అన్నారు. ఔషధ మొక్కల ప్రాముఖ్యతను తెలుసుకొని ఇంట్లో పెంచుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో వందేమాతరం ఫౌండేషన్ రాష్ట్ర కార్యదర్శి మాధవరెడ్డి, ఉపాధ్యాయులు శేఖర్, జగదీశ్, సీజీఆర్ ప్రతినిధులు నాగేశ్, జ్ఞానేశ్వర్, రజనీకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్యాంకులోకి భగీరథ నీరు

- ఆనందం వ్యక్తం చేసిన బైర్యాన్‌పల్లి వాసులు



రంగారెడ్డి అర్బన్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): కేశంపేట మండల పరిధిలోని బైర్యాన్‌పల్లిలోని ట్యాంకులోకి మిషన్ భగీరథ నీరు ఎక్కించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. తమ ఇళ్లకు నల్లాల ద్వార నీరు వస్తుందని మురిసి పోయారు. మిషన్ భగీరథ పథకంలో భాగంగా గ్రామంలో నిర్మించిన ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకులోకి గ్రావిటీ ద్వారా నీరు ఎక్కడం లేదు. దీంతో వాటర్ ట్యాంకు దిష్టిబొమ్మగా మారింది. ఈ సమస్యపై 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో మార్చి 1న 'భగీరథా... ఏమిటీ వ్యథ' అనే కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన ఎంపీడీవో రవిచంద్రకుమార్ రెడ్డి, మిషన్ భగీరథ ఏఈ నాగమణి పనులు చేయించారు. మంగళవారం వాటర్ ట్యాంకును శుభ్రం చేయించి నీటిని ఎక్కించారు. అనంతరం గ్రామంలోని నల్లాలకు నీటిని వదిలారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన 'ఆంధ్రజ్యోతి'కి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.



ఆలయం కోసం నగదు అందజేస్తున్న నాయకులు

విగ్రహ ప్రతిష్ఠకు మాజీ ఎమ్మెల్యే చేయూత

రంగారెడ్డి అర్బన్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): నందిగామ మండలం మోత్కుళ్లగూడలో నిర్మిస్తున్న ఆంజనేయస్వామి ఆలయంలో దేవతామూర్తుల ప్రతిష్ఠకు మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ రూ.50వేల విరాళాన్ని ప్రకటించారు. ఈ ఆర్థిక సహాయాన్ని మంగళవారం బీఆర్ఎస్ నాయకుల ద్వారా ఆయన మోత్కుళ్లగూడలోని దేవాలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయ అభివృద్ధికి తన వంతుగా సహకరిస్తానని ఈ సందర్భంగా అంజయ్యయాదవ్ పేర్కొన్నారు. విరాళం ఇచ్చిన ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల ఆదాయం రూ.92.49లక్షలు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న నిర్వాహకులు

కీసర, మార్చి 4(ఆంధ్రజ్యోతి): కీసరగుట్టలో జరిగిన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఆదాయం రూ.92,49,961 వచ్చినట్లు ఆలయ చైర్మన్ తటాకం నారాయణ శర్మ, ఈవో సుధాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శేఖర్ పర్యవేక్షణలో ఆలయ మహామండపంలో హుండీ ఆదాయాన్ని లెక్కించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా అభిషేకాలు, కల్యాణోత్సవం, కల్యాణ కట్నాలు, రథం కట్నాలు, వీవీఐపీ దర్శనాలు, నందివాహన సేవ, ప్రసాదాల వితరణ, హుండీ ఆదాయ మొత్తాన్ని లెక్కించినట్లు నిర్వహకులు తెలిపారు. వచ్చిన ఆదాయాన్ని దేవస్థానం పేరిట కీసర ఎస్‌బీఐ బ్యాంక్ ఖాతాలో జమ చేశామన్నారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ సభ్యులు, ట్రస్ట్ బోర్డు సభ్యులు, ప్రధాన అర్చకుడు, భక్తులు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం



ఎంపీ రవిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి, పాస్టర్ రూపస్, నాయకులు

ఆమనగల్లు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఏసు భగవానుడు మానవత్వం, శాంతి, కరుణ మార్గాలను ప్రబోధించి ప్రజల్లో చిరస్థాయిగా నిలిచాడని, ఆయన బోధనలు అనుసరణీయం అని నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కె.నారాయణరెడ్డి అన్నారు. ఆకుతోటపల్లిలోని ఎంబీ సాలెం చర్చి శతాబ్ది ఉత్సవాలను మంగళవారం పాస్టర్ జీకే రూపస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వివిధ జిల్లాల పాస్టర్లు, క్రైస్తవులు తరలివచ్చారు. ఎంపీ, ఎమ్మెల్యే ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రార్థనానంతరం ఉత్సవాలను ప్రారంభించారు. భక్తి గీతాలాపనలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఎంపీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, సామాజిక న్యాయానికి కట్టుబడి ఉందన్నారు. క్రైస్తవుల సంక్షేమం, చర్చిల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తుందన్నారు. జీకె.కృపయ్య వందేళ్ల క్రితం ఇక్కడ చర్చ్ నిర్మించడం గొప్ప విషయం అన్నారు. 1893లో ఆమెరికాలోని చికాగోలో నిర్వహించిన మాదిరిగా ఆకుతోటపల్లిలో త్వరలో సర్వమత సమ్మేళనం, సన్మాన కార్యక్రమాలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ చర్చి పునరుద్ధరణకు తాను రూ.3లక్షల వితరణ చేస్తానని రవి ప్రకటించారు. కార్యక్రమంలో చర్చి నిర్వాహకులు లాసర్, రాంచంద్రయ్య, రాజరత్నం, బుచ్చయ్య, శివాజీ, ప్రమోద్, అబ్రహం, మాజీ జడ్పీటీసీ శ్రీపతి శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ వైస్‌చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు యాట నర్సింహ, గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, జగన్, మానయ్య, అనితవిజయ్, ఫరీద్, కృష్ణనాయక్, మెకానిక్‌బాబు, మహేశ్, పి.రాములు, షాబుద్దీన్, బుచ్చయ్య, కొండయ్య పాల్గొన్నారు.



జవహర్‌నగర్ మున్సిపల్ ఆఫీసు వద్ద బైఠాయించిన మహిళలు

ఎన్యూమరేటర్ల డబ్బులివ్వాలి

- జవహర్‌నగర్ కార్పొరేషన్ ఆఫీసు ముట్టడి

బిట్స్ పిలానీ, మార్చి 4(ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వే చేసిన ఎన్యూమరేటర్లకు ఐదు నెలలు గడిచిపోతున్నా డబ్బులు చెల్లించలేదని మంగళవారం జవహర్‌నగర్ కార్పొరేషన్ కార్యాలయాన్ని మహిళా నిరుద్యోగులు ముట్టడించారు. 229 మంది లేడీ ఎన్యూమరేటర్లు ఆఫీసును ముట్టడించారు. కమిషనర్ వచ్చి హామీ ఇచ్చే ధర్నా విరమించం అన్నారు. ప్రధాన ద్వారం ముందు బైఠాయించారు. గత నవంబరులో సమగ్ర కుటుంబ సర్వే చేసిన ఎన్యూరేటర్లకు రూ.10వేలు ఇస్తామని సర్వే చేయించుకున్నారన్నారు. స్థానిక మహిళా నిరుద్యోగులు నెలరోజులు సర్వే చేసి నివేదికలను అధికారులకు అందించారు. అయితే వారికి ఇప్పటికీ డబ్బులు ఇవ్వలేదు. కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా డబ్బులు ఇవ్వడం లేదని ఎన్యూమరేటర్లు ఆందోళనకు దిగారు. దీంతో కమిషనర్ వసంత వచ్చి వారితో మాట్లాడారు. జవహర్‌నగర్ కార్పోరేషన్‌కు సమగ్ర కుటుంబ సర్వే నిధులు రూ.25లక్షలు రావాల్సి ఉందని, ఎన్యూమరేటర్లకు చెల్లించే డబ్బు విషయంపై అధికారులతో మాట్లాడి డబ్బులందేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్, బీజేపీ నాయకులు భాస్కర్, విక్రమ్, శంకర్ తదితులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహిళా భద్రతా విభాగ ఎస్పీ అశోక్‌కుమార్

చదువుతోనే గుర్తింపు

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): చదువుతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని మహిళా భద్రతా విభాగ ఎస్పీ జె.అశోక్‌కుమార్ అన్నారు. ఘట్‌కేసర్ పరిధి అవుశాపూర్ ప్రభుత్వ పాఠశాలలో 'మై చాయిస్' ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సేఫ్ విలేజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలపై లైంగిక దాడులు, అక్రమ రవాణాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. బాలికలు కష్టపడి చదివి ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. మహిళలు, బాలికలు అధైర్యపడొద్దని, ఆపద సమయంలో 100 నంబర్‌కు కాల్ చేయాలని, నిమిషాల్లోనే పోలీసులు చేరుకుంటారని తెలిపారు. బాల్య వివాహాలు, బాలకార్మిక వ్యవస్థ, అక్రమ రవాణాలపై నిఘా పెంచామన్నారు. బాగా చదివి తల్లిదండ్రులకు పేరు తెచ్చి ఉన్నత సమాజస్థాపనకు కృషిచేయాలన్నారు. వ్యసనాలకు దూరంగా ఉండాలని తెలిపారు. మై చాయిస్ ఫౌండేషన్ పదివేల గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు పూర్తిచేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ కావేరి మశ్చేందర్‌రెడ్డి, ఫౌండేషన్ ప్రతినిధులు ఎల్క, గ్రోఫ్లర్, డేనియల్, హెచ్‌ఎం శైలజ, నాయకులు మశ్చేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సాయిలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

దైవ కార్యక్రమాలతో సమాజ శాంతి

ఆమనగల్లు, మార్చి 4(ఆంధ్రజ్యోతి): సమాజంలో శాంతి నెలకొనేందుకు, మానవాళి పురోగమనానికి దైవ కార్యక్రమాలు దోహదం చేస్తాయని టాస్క్ సీవోవో, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. ఆమనగల్లులోని శ్రీ కంఠమహేశ్వర స్వామి ఆలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. పబ్బతి ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు, అభిషేకంలో పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ అల్లాజీగౌడ్, ప్రధాన కార్యదర్శి రవీందర్‌గౌడ్, నిర్వాహకులు రాఘవేందర్‌రెడ్డిని సత్కరించారు. ఆలయాభివృద్ధికి సహకరించిన సుంకిరెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఐక్యత ఫౌండేషన్ ద్వారా నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి పాటుపడుతున్నట్టు చెప్పారు. ఆలయాల జీర్ణోద్ధరణ, దైవకార్యక్రమాలకు, పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. విద్య, వైద్యం, ఉపాధి కల్పనే ఫౌండేషన్ ధ్యేయం అన్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు, నాయకులు బాలకృష్ణగౌడ్, డి.యాదయ్య, నిరంజన్, వెంకటయ్య, సతీష్‌గౌడ్, నర్సింహాగౌడ్, కుమార్, వెంకటయ్య, బాలకృష్ణ, నిరంజన్, సురేశ్, నారాయణ, శ్రీరాములు, శ్రీనివాస్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.



రాఘవేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న అల్లాజీగౌడ్, రవీందర్, గౌడ సంఘం నాయకులు

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు

- తహసీల్దార్ రవీందర్ దత్ హెచ్చరిక
- గొల్లపల్లిలో అక్రమ నిర్మాణాల కూల్చివేత

రంగారెడ్డి అర్బన్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తే కఠిన చర్యలు తప్పవని, క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తామని తహసీల్దార్ రవీందర్ దత్ హెచ్చరించారు. ప్రభుత్వ భూములు క్రయవిక్రయాలు చేయడం నేరమని తెలిపారు. గతంలో ప్రభుత్వం మున్సిపల్ పరిధిలోని సర్వే నెం 219, 220 221లో కొందరు నిరుపేదలకు భూములు ఇచ్చారు. అయితే కొందరు అక్రమార్కులు ఆ భూములను తక్కువ ధరకు కొనుగోలు చేసి ప్లాట్లుగా మార్చి ఇళ్ల నిర్మాణం చేశారు. వాటికి ఇంటి నంబర్లు కూడా తీసుకున్నారు. ఆ నిర్మాణాలను తహసీల్దార్ సమక్షంలో మంగళవారం కూల్చివేశారు. అక్రమంగా ఇంటి నెంబర్లు ఇస్తున్నారనే ఆరోపణలపై మున్సిపల్ కమిషనర్‌ను తహసీల్దార్ వివరణ కోరారు. గొల్లపల్లిలో కొన్ని ఇళ్ల నంబర్లను రద్దు చేసినట్లు వివరించారు. రద్దు చేసిన ఇంటి నంబర్ల జాబితా ఇవ్వాలని కోరగా త్వరలోనే పూర్తి వివరాలు ఇస్తామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఐ కృష్ణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఘట్‌కేసర్‌లో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర బ్రాంచ్ ప్రారంభం



ఘట్‌కేసర్‌లో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న హరికృష్ణ, ప్రసాద్

ఘట్‌కేసర్, మార్చి4(ఆంధ్రజ్యోతి): ప్రముఖ ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఒకటైన బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర మంగళవారం మేడ్చల్ జిల్లా ఘట్కేసర్‌లో నూతన శాఖను ప్రారంభించింది. ఘట్కేసర్ మున్సిపాలిటీ పరిధి శివారెడ్డిగూడలో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర బ్రాంచ్‌ను బ్యాంక్ డిప్యూటీ జోనల్ మేనేజర్ కె.హరికృష్ణ సమక్షంలో హైదరాబాద్ జోనల్ మేనేజర్ ప్రసాద్ ముఖ్య అతిథిగా వచ్చి ప్రారంభించారు. ఈ బ్రాంచ్‌తో తెలంగాణ జిల్లాల్లో తమ బ్రాంచ్‌ల సంఖ్య 73కు చేరిందని అధికారులు తెలిపారు. ఘట్కేసర్ బ్రాంచ్ అన్ని సాధారణ బ్యాంకింగ్ లావాదేవీలు, ఖాతాదారులకు అవసరమైన నిర్దిష్ట సేవలందిస్తుందని చెప్పారు. ఖాతాదారులకు ఏటీఎం కమ్ డెబిట్ కార్డ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, 24/7 కస్టమర్ కేర్ సర్వీసెస్, మొబైల్ బ్యాంకింగ్ వంటి సౌకర్యాలను అందిస్తున్నామని తెలిపారు. జోనల్ మేనేజర్ మాట్లాడుతూ.. ఘట్కేసర్ బీఓఎం శాఖ ప్రజల అన్ని బ్యాంకింగ్, ఆర్థిక అవసరాలు తీర్చేందుకు పాటుపడుతుందన్నారు. కొత్త శాఖను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. డిప్యూటీ జోనల్ మేనేజర్ మాట్లాడుతూ.. రీటైల్ కస్టమర్లకు, చిరు లెవెల్ వ్యాపారులకు బ్యాంకింగ్ సేవలను మరింత సమర్థంగా అందిస్తామన్నారు. బ్యాంకింగ్ అవసరాలకు ఇది ఒక స్టాప్‌షాప్‌గా ఉంటుందని చెప్పారు. తమ బ్యాంక్ దేశంలో 2,400పైగా శాఖలతో 3కోట్ల మంది ఖాతాదారులకు సేవలందిస్తోందన్నారు. ఈ సందర్భంగా ఘట్కేసర్ బ్రాంచ్ మేనేజర్ బాలినా యాకుబ్‌రావ్ అతిథులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్న రిటైర్డ్ జడ్జి సాంబశివరావు

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

చేవెళ్ల, మార్చి 4(ఆంధ్రజ్యోతి): లోక్ అదాలత్ సేవలను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని రిటైర్డ్ జడ్జి సాంబశివరావు అన్నారు. చేవెళ్ల కోర్టు ఆవరణలో మంగళవారం లోక్‌అదాలత్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు తప్పవన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపిన 71మంది కేసులను పరిష్కరించి రూ.1,86,500, అలాగే డ్రైవింగ్ లైసెన్స్ లేని 63 మందికి రూ.83,500 జరిమానా విధించామని తెలిపారు. కార్యక్రమంలో చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం, ఏఎస్సై చందర్‌నాయక్, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

8 వరకు తాండూరు మున్సిఫ్ కోర్టులో లోక్ అదాలత్ : ఎస్సై



తాండూరు రూరల్: ఈ నెల 8వ తేదీ వరకు తాండూరు మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో నిర్వహించే లోక్ అదాలత్‌ను కక్షిదారులు వినియోగించుకోవాలని కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి కోరారు. పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడారు. 75కేసుల వరకు ఉన్నాయని, 25కేసుల వరకు లోక్‌అదాలత్‌లో పరిష్కారరమయ్యే అవకాశం ఉందన్నారు.

యజమాని వస్తేనే బస్సును వదుల్తాం

- బాలుడి మృతికి పరిహారమివ్వాలని డిమాండ్



ఆందోళనకు దిగిన వారితో మట్లాడుతున్న ఎస్ఐ శంకర్

బషీరాబాద్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): బాలుడి మృతికి కారణమైన ఆర్టీసీ అద్దె బస్సును యజమాని వచ్చేదాకా వదలం అని మృతుడి కుటుంబీకులు, తండావాసులు అడ్డుకున్న ఘటన బషీరాబాద్ టాకీ తండా వద్ద మంగళవారం మధ్యాహ్నం జరిగింది. గత నెల 19న ఆర్టీసీ అద్దె బస్సుకింద పడి రథోడ్ వెంకటేష్ కుమారుడు శ్రీరామ్(7) మృతి చెందాడు. ఆందోళన చేసిన బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని డిపో మేనేజర్ హామీ ఇవ్వడంతో బాలుడి మృతదేహాన్ని ఖననం చేశారు. అయితే ఇంత వరకూ తమను ఎవరూ పట్టించుకోవడంలేదని ఆగ్రహించిన బాలుడి కుటుంబీకులు, గ్రామస్థులు మైల్వార్‌కు వెళ్తున్న అద్దె బస్సును అడ్డుకున్నారు. బస్సు యజమాని వచ్చి మాట్లాడితేనే బస్సును కదలనిస్తామని భీష్మించారు. దీంతో బషీరాబాద్ ఎస్ఐ శంకర్, సిబ్బందితో అక్కడికి చేరుకొని ఆరా తీశారు. ఆర్టీసీ డీఎంకు సమాచారం ఇవ్వడంతో ఆయన తండావాసులతో మట్లాడారు. బుధవారం ఇంటర్ పరీక్షలున్నాయని, సర్వీసు అవసరం అని, న్యాయం కోసం బస్సు యజమానితో మట్లాడిస్తానని ఒప్పించడంతో బస్సును వదిలేశారు.



సబితాఇంద్రారెడ్డితో ప్రకాశ్‌రెడ్డి

గ్రామాల అభివృద్ధికి కృషి

రంగారెడ్డి అర్బన్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): తాను ప్రతిపక్షంలో ఉన్నా గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వంతో కొట్లాడైనా నిధులు మంజూరుకు తన వంతు కృషి చేస్తానని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి అన్నారు. మండలంలోని కొత్తగూడ గ్రామాభివృద్ధికి కృషి చేయాలని కోరుతూ ఏఎంసీ మాజీ డైరక్టర్ సామ ప్రకాశ్‌రెడ్డి మంగళవారం ఆమెను కలిసి వినతిపత్రం ఇచ్చారు. మండల కేంద్రం నుంచి కొత్తగూడ పంచాయతీలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు బీటీ రోడ్డుకు నిధులు మంజూరు చేయాలని, కస్తూర్బాగాంధీ బదిరుల పాఠశాల వరకు సీసీ రోడ్డు, సీతారామశాస్త్రి నగర్, హైదరాబాద్ టెక్నోస్కూల్ కాలనీల్లో అండర్ డ్రైనేజీ, నిర్మాణానికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని ప్రకాశ్‌రెడ్డి వినతి పత్రం అందజేశారు. ఈమేరకు సబితాఇంద్రారెడ్డి గ్రామాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

వైద్యఖర్చులకు చేయూత

ఆమనగల్లు, మార్చి4(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌తో బాధపడుతున్న అప్పారెడ్డి పల్లి గ్రామానికి చెందిన పల్లెటి జనార్దన్ కు మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, తలకొండపల్లి మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ చేయూతనందించారు. హైదరాబాద్ బసవతారకం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జనార్దన్ ను మంగళవారం ఆయన పరామర్శించారు. చికిత్సల కోసం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ. 10 వేలు ఆర్థిక సాయాన్ని జనార్దన్ భార్య కవిత కు అందజేశారు. అధైర్య పడవద్దని భరోసా ఇచ్చారు. పరామర్శించిన వారిలో గౌరవరం విష్ణువర్ధన్‌రెడ్డి, రాజవర్దన్ రెడ్డి, పల్లెటి యాదయ్య, తోట వెంకటయ్య, వంశీ, తదితరులు ఉన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

షాద్‌నగర్‌రూరల్/రంగారెడ్డి అర్బన్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని ఏసీపీ రంగస్వామి తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం చించోడు గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను మంగళవారం ఆయన ప్రారంభించారు. గ్రామస్తులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసు కోవడం అభినందనీయమన్నారు. గ్రామంలో సంపూర్ణ మద్యపాన నిషేదం విధించు కోవడం మంచి సాంప్రదాయమన్నారు. ఇన్ స్పెక్టర్ విజయ్‌కుమార్ గ్రామస్తులున్నారు. అదేవిధంగా గ్రామాల్లో సీసీ కెమోరాలను ఏర్పాటు చేయడం వల్ల నేరాలను నియంత్రించడానికి దోహదపడతాయని హైదరాబాద్ గ్రీన్‌ఫార్మా పోలీస్‌స్టేషన్ సీఐ లిక్కి కృష్ణంరాజు తెలిపారు. కందుకూరు మండలంలోని సాయిరెడ్డిగూడలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడానికి సీఐకి బీఆర్ఎస్ నాయకులు సప్పిడి గోవర్దన్ మంగళవారం రూ.20 వేలు అందజేశారు. సీఐ మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలని కోరారు.

సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలి

కడ్తాల్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): సేవా కార్యక్రమాల్లో ప్రతీ ఒక్కరు తమ వంతు పాలు పంచుకోవాలని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. కడ్తాల మండల కేంద్రంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబలి కేంద్రాన్ని మంగళవారం లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, కార్యదర్శి దోనాదుల మహేశ్‌లతో కలిసి సందర్శించారు. బాటసారులు, ప్రయాణికులకు అంబలి పంపిణీ చేశారు. ప్రతియేటా అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులను ఆయన అభినందించారు. లయన్స్‌క్లబ్ పీఆర్‌వో ఎంఏ పాష, కోశాధికారి గుజ్జరి నర్సింహ, జహంగీర్‌అలీ, సాయిప్రభు, రాజు, తరుణ్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

తలకొండపల్లి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఏర్పాటు కోసం గట్టిప్పలపల్లి గ్రామస్థులు పోరాటం ఉధృతం చేశారు. పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం 123వ రోజుకు చేరాయి. జేఏసీ నాయకులు, వివిధ పార్టీల నేతలు, యువకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. దీక్షలకు సంఘీభావంగా గ్రామంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసే 11 కొత్త మండలాల్లో గట్టిప్పలపల్లిని చేర్చాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల వరకు గట్టిప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించకపోతే ఎన్నికలను బహిష్కరిస్తామని తెలిపారు. 11 గ్రామ పంచాయతీలను కలిపి మండల కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. జేఏసీ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



దీక్షలో జేఏసీ నాయకులు

నిరుపేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

● షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కొత్తూర్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): నిరుపేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో మంగళవారం కొత్తూర్ మండల పరిధిలోని పలువురు లబ్దిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదల సంక్షేమం కోసం కట్టుబడి పనిచేస్తుందన్నారు. కొత్తూర్ మండలంతో పాటు, మున్సిపాలిటీలో పలు సమస్యలు గుర్తించడం జరిగిందని, త్వరలో సమస్యలన్నీ పరిష్కరిస్తామన్నారు. రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని గుర్తుచేశారు. ప్రతిపక్షాలు పనిలేక ప్రభుత్వంపై బురదజల్లే ఆరోపణలు చేస్తున్నారని, వారికి ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, ఆర్ఐ రాంబాబు, కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు గొంగళ్ల హరినాథ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రవినాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎల్లారం శేఖర్‌రెడ్డి, ఉప్పల దయానంద్‌గుప్త తదితరులు పాల్గొన్నారు.



కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

'ఎమ్మెల్సీ' విజయంపై బీజేపీ సంబురాలు

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీదే హవా అని చెప్పడానికి నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థి మల్క కొమురయ్య ఘన విజయమే నిదర్శనమని బీజేపీ జాతీయ కిసాన్‌మోర్చా కార్యవర్గ సభ్యుడు బస్వ పాపయ్యగౌడ్ అన్నారు. కొమురయ్య విజయంతో మహేశ్వరంలో బీజేపీ మండలాధ్యక్షుడు యాదీష్ ఆధ్వర్యంలో బాణ సంచాలు పేలుస్తూ స్వీట్లు పంచుకున్నారు. మిద్దె సుదర్శన్‌రెడ్డి, పోతర్ల సుదర్శన్‌యాదవ్, ఆయిళ్లయాదయ్యగౌడ్, దుశ్యానాయక్, మంత్రిముత్యం, తదితరులున్నారు. మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో తెలంగాణలో బీజేపీ మరింత బలోపేతం అవుతుందని కందుకూరు మండల శాఖ అధ్యక్షుడు అంజిరెడ్డి అన్నారు. కొమురయ్య గెలుపొందడంతో మండల కేంద్రంలోని హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై నాయకులతో కలిసి టపాసులు కాల్చి, మిఠాయిలు పంచుకున్నారు. ఎన్.నర్సింహరెడ్డి, ఎస్.భూమిరెడ్డి, సోమరాజు వెంకటేష్, కె.సుధాకర్‌రెడ్డి, కె.చెన్నారెడ్డి, రఘునందన్, ఆంజనేయులు, ప్రవీణ్‌రెడ్డి, అనిల్‌కుమార్, తదితరులున్నారు. కొమురయ్య గెలుపును హర్షిస్తూ కేశంపేట మండలాధ్యక్షురాలు రాధిక ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నాయకులు సంబరాలు జరుపుకున్నారు. రఘురాంగౌడ్, నర్సింహులు, నర్సింహ, కృష్ణయ్య, హరికృష్ణ, విఠల్‌గౌడ్, కురుమయ్య తదితరులున్నారు. రాష్ట్రంలో ఎన్నికలు ఏవైనా బీజేపీదే గెలుపని కొందుర్గు బీజేపీ మండలాధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రలోని ఉన్నత పాఠశాలలో టీచర్లతో కలిసి స్వీట్లు పంచి సంబరాలు జరుపుకున్నారు. శివారెడ్డి, శ్రీశైలం, నర్సింహులు శ్రీనివాస్, యాదగిరి వీరేష్ పాల్గొన్నారు.

షాద్‌నగర్ అర్బన్ : తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికలేవైనా బీజేపీ విజయం సాధిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, అందె బాబయ్యలు ధీమా వ్యక్తం చేశారు. కొమురయ్య విజయం సాధించడంతో షాద్‌నగర్ చౌరస్తాలో నాయకులు సంబురాలను జరుపుకున్నారు. పార్టీ పట్టణశాఖ అధ్యక్షుడు హరిభూష ణ్ పటేల్ ఆధ్వర్యంలో జరిగిన సంబురాల్లో పాల్గొన్న విష్ణువర్ధన్‌రెడ్డి, బాబయ్యలు మాట్లాడుతూ పట్టభద్రుల ఎన్నికల్లో సైతం బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి భారీ మెజార్టీతో ఘన విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. నాయకులు చిట్టెం లక్ష్మీకాంత్‌రెడ్డి, ఇస్నాతి శ్రీనివాస్, చెట్ల వెంకటేష్, ఎం.మురళీ, సుధాకర్, బాల్‌రెడ్డి, అత్తాపూర్ మహేందర్‌రెడ్డి, నర్సింహ, మోహన్‌నాయక్, కుడుముల బాల్‌రాజ్, రంగన్నగౌడ్, విజయ్, హన్మంతు తదితరులున్నారు.

చేవెళ్ల : కొమురయ్య విజయం సాధించడం పట్ల బీజేపీ చేవెళ్ల మండలాధ్యక్షుడు అత్తెల్లి అనంతరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. చేవెళ్ల పట్టణ కేంద్రంలో నాయకులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ జిల్లా నాయకులు కుంచం శ్రీనివాస్‌గుప్తా, అంజనేయులుగౌడ్, దేవుని శర్వలింగం, మండల ఉపాధ్యక్షుడు కృష్ణగౌడ్, నాయకులు వెంకట్‌రాంరెడ్డి, సత్యనారాయణ, జయశంకర్,పిసరి శ్రీకాంత్, చేగురి ప్రవీణ్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, కృష్ణ, దయాకర్, సందీప్‌గౌడ్, ధనుష్‌రెడ్డి, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.



షాద్‌నగర్ అర్బన్ : బీజేపీ నాయకుల సంబురాలు

ఆ గ్రామంలో అన్నీ సమస్యలే!

(5వ పేజీ తరువాయి)

కట్ట వెంబడి కాశిరెడ్డిగూడ వరకు నడుచుకుంటూ రావాల్సిందే. ఆ దారి కూడా సక్రమంగా లేకపోవడంతో గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. కొత్తగా ప్రభుత్వ భూమిలో నుంచి రోడ్డు వేస్తున్నా అది కూడా అనువుగా లేదని గ్రామస్తులు వాపోతున్నారు. విచిత్రమేమంటే రైల్వే స్టేషన్‌కు అతి చేరువలో ఉన్న గ్రామానికి ఇప్పటి వరకు అంబులెన్స్ రాలేదు. ఆపదవస్తే కాశిరెడ్డిగూడ వరకు వ్యయప్రయాసల కోర్చి రావాల్సిందే.

అందని ప్రభుత్వ పథకాలు

ఈ గ్రామస్తులకు ఇప్పటివరకు ఒక్క ప్రభుత్వ పథకం కూడా వర్తించలేదు. ప్రభుత్వం మంజూరు చేసే ఇందిరమ్మ ఇళ్లు ఇప్పటివరకు పీర్లగూడకు రాలేదు. కుటుంబాలు పెరగడం, పెళ్లిళ్లు కావడంతో ఉన్న ఇంటిలోనే గోడలు పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. ఎన్నికల సమయంలో తమ గ్రామానికి వచ్చే నాయకులు ఆ తర్వాత అటువైపు తిరిగి చూడరని గ్రామస్తులు వాపోతున్నారు. గ్రామంలో కేవలం 50 మీటర్ల సీసీ రోడ్డు మాత్రం నిర్మించారు. కొత్త గ్రామ పంచాయతీల ఏర్పాటు తర్వాత ప్రస్తుతం పీర్లగూడ గ్రామం చింతగూడ పంచాయతీలో కలిపారు. చింతగూడలో విలీనం చేసి ఐదేళ్ల గడుస్తున్నా ఏ మాత్రం అభివృద్ధికి నోచుకోవడం లేదని గ్రామస్తులు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి ప్రభుత్వ పథకాలు తమకు అందేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి



చాలా ఏళ్లుగా ఇల్లు లేక చాలా ఇబ్బందులు పడుతున్నాం. తమ గ్రామానికి ఇందిరమ్మ ఇళ్లు తక్షణమే మంజూరు చేయాలి. ఈ విషయమై ఎవరికి చెప్పినా తమ గోడు వినిపించుకోవడం లేదు.

- నందారం రవీందర్, పీర్లగూడ

విజయోస్తు..!

(5వ పేజీ తరువాయి)

విద్యార్థులు కూర్చునే విధంగా కేటాయించినా ప్రతి 20 మంది విద్యార్థులకు ఒక ఇన్విజిలేటర్ వంతున నియమించారు. ఒక్కో పరీక్షా కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, ఒక డిపార్ట్‌మెంటల్ అధికారిని కేటాయించారు. అలాగే అసిస్టెంట్ డిపార్టుమెంట్ అధికారులు 145, కస్టోడియన్ అధికారులు 45, పరీక్షల్లో కాపీయింగ్‌కు అవకాశం కల్పించకుండా 4 ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్, 5 సిట్టింగ్ స్క్వాడ్ టీమ్స్‌ను ఏర్పాటు చేశారు.

నిఘా నీడలో..

పోలీసు స్టేషన్ నుంచి పరీక్షా కేంద్రాలకు ప్రశ్నపత్రాలు తీసుకువచ్చి సీల్ తీయడం నుంచి విద్యార్థులు రాసిన ఆన్సర్ షీట్లను సీల్ వేయడం వరకు అంతా సీసీ కెమెరాల నిఘా పర్యవేక్షణలోనే కొనసాగనుంది. చీఫ్ సూపరింటెండెంట్ మినహా మిగతా వారెవరికీ మొబైల్ ఫోన్లను అనుమతించరు. సంబంధిత అధికారి జారీ చేసిన గుర్తింపు కార్డులు ధరించిన వారినే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారు. విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి ఉదయం 9.05 గంటల వరకు అనుమతించనున్నారు. 31 ప్రశ్నపత్రాల స్టోరేజీ పాయింట్ల నుంచి పోలీస్ ఎస్కార్ట్‌తో ప్రభుత్వ వాహనంలో తరలించనున్నారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లకు అనుమతి లేదు. ఎగ్జామ్ ప్యాడ్, పెన్ను, పెన్సిల్, రబ్బర్, హాల్‌టికెట్ మాత్రమే తీసుకురావాల్సి ఉంటుంది. పరీక్ష సెంటర్ వద్ద బందోబస్తు కోసం ఇద్దరు కానిస్టేబుళ్లను నియమిస్తున్నారు.

బీరప్ప ఆలయ నిర్మాణానికి విరాళం



నగదు అందజేస్తున్న వ్యాపారవేత్త ఎమ్మె శ్రీశైలం

కొత్తూర్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎస్‌బీ పల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న బీరప్ప దేవాలయ నిర్మాణానికి తన వంతుగా రియల్‌ఎస్టేట్ వ్యాపారవేత్త ఎమ్మె శ్రీశైలం రూ. 1,01,116 విరాళంగా అందజేసి ఉదారతను చాటుకున్నాడు. కొత్తూర్ జడ్పీటీసీ ఎమ్మె సత్యనారాయణ చేతుల మీదుగా దేవాలయ కమిటీ సభ్యులకు నగదును అందజేశారు. మాజీ సర్పంచ్ వెంకటయ్య, ఉప సర్పంచ్ బాల్‌రాజ్, నాయకులు శ్రీశైలం, కుర్మ సంఘం అధ్యక్షుడు ఎమ్మె అజయ్‌కుమార్, ఎమ్మె మల్లేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సొంత డబ్బుతో ఆలయానికి 'బోరు'

కొత్తూర్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వేంకటేశ్వరాలయంలో మంచినీటి సమస్యను తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు గొంగళ్ల హరినాథ్‌రెడ్డి రూ.50వేల డబ్బుతో బోరు వేయించి ఉదారత చాటుకున్నాడు. వేసవిలో భక్తులకు సమస్య ఎదురుకాకుండా బోరు వేయించానని, నీరు పుష్కలంగా వచ్చిందని హరినాథ్‌రెడ్డి పేర్కొన్నారు. మెండె కృష్ణయాదవ్, రాములు, శేఖర్, నర్సింహులు, అంజనేయులు, పాపయ్య, శ్రీశైలం, చంద్రయ్య, నర్సింహ, జంగయ్య, బాల్‌రాజ్ తదితరులున్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి వంట సామగ్రి అందజేత

మున్సిపాలిటీలోని అంగన్‌వాడీ-3 కేంద్రానికి స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఓంప్రకాష్‌చారి వంట సామగ్రి అందజేసి చేయూతనందించాడు. మల్లేష్‌ముదిరాజ్, లింగారెడ్డి, ప్రభాకర్‌గౌడ్, మల్లేష్‌యాదవ్, భీష్మాచారి తదితరులున్నారు. అదేవిధంగా కరణం కార్తీక్‌రావు విద్యార్థులకు ఆంగ్లం, తెలుగు, గణితం చార్టులతో కూర్చోవడానికి చాపలను అందజేసి ఉదారత చాటుకున్నాడు.

ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లింపులో రాయితీ

రంగారెడ్డి అర్బన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లింపులపై 25 శాతం రాయితీ ఇవ్వనున్నట్లు శంషాబాద్ మున్సిపల్ కమిషనర్ సుమన్‌రావు తెలిపారు. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం ఎల్ఆర్ఎస్ అప్లికేషన్లపై ఫీల్డ్ వెరిఫికేషన్ చేశారు. ఈమేరకు మున్సిపాలిటీ పరిధిలో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తామన్నారు. కాల్ సెంటర్, హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేస్తామన్నారు. సేల్‌డీడ్ రిజిస్ట్రేషన్ సమయంలో కూడా ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేయచ్చని తెలిపారు. రిజిస్ట్రేషన్, ఎల్ఆర్ఎస్ ప్రక్రియ రెండూ ఒకేసారి చేసుకోవచ్చని కమిషనర్ చెప్పారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కడ్తాల్, మార్చి4(ఆంధ్రజ్యోతి): కర్కల్‌పహాడ్‌కు చెందిన సిల్వేరు శ్రీనివాస్ అనారోగ్యంతో మృతిచెందాడు. మంగళవారం మృతదేహాన్ని మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, మాజీవైస్ ఎంపీపీ ఆనంద్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డిలు సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబానికి నాయకులతో కలిసి లక్ష్మీనర్సింహారెడ్డి రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. బాల్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

ఆరోపణలు ఆపి అభివృద్ధిని చూడండి

షాద్‌నగర్ అర్బన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యాభివృద్ధిని పట్టించుకోలేదని కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ఆరోపణలను ఆపి, అభివృద్ధి చేసి చూపాలని బీఆర్ఎస్ షాద్‌నగర్ పట్టణ శాఖ అధ్యక్షుడు ఎంఎస్ నటరాజ్ డిమాండ్ చేశారు. షాద్‌నగర్‌లోని బీఆర్ఎస్ క్యాంపు ఆఫీసులో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫరూఖ్‌నగర్ ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణానికి రూ.43.5 లక్షలు మంజూరు చేసినట్లు ప్రచారం చేసుకున్న కాంగ్రెస్ పార్టీ.. గత ప్రభుత్వం విద్యావ్యవస్థను ఏమాత్రం పట్టించుకోలేదని అభాండాలు వేయడం సరికాదన్నారు. కాంగ్రెస్ నాయకులు అధికారంలో ఉన్నామన్న విషయాన్ని మర్చిపోయి, ప్రతిపక్ష పార్టీలపై ఆరోపణలు చేయడానికే సమయాన్ని కేటాయిస్తున్నారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ కృషితో జహంగీర్ పీర్ దర్గా వద్ద రూ.5కోట్లతో ఎస్టీ బాలుర పాఠశాల భవనాన్ని, రూ.6కోట్ల 60 లక్షలతో కొందుర్గులో కస్తూర్బాగాంధీ పాఠశాల భవనంతో పాటు ప్రతీ పాఠశాలలో మరమ్మతుల కోసం ప్రత్యేక నిధులు తెచ్చారని అన్నారు. కాంగ్రెస్ నాయకులకు చేతనైతే గత ఎన్నికల ముందు పాఠశాలల అభివృద్ధి కోసం చేసిన పనుల బిల్లులు ఇప్పించాలని నటరాజ్ డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు అంతయ్య, రవియాదవ్, జూపల్లి శంకర్ బీష్వ రామకృష్ణ, అశోక్‌యాదవ్, పిల్లి శేఖర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఎస్ నటరాజ్

విద్యార్థులను శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలి



సైన్స్ ఫెయిర్‌ను ప్రారంభిస్తున్న న్యాయమూర్తి కాటం స్వరూప

ఆమనగల్లు, మార్చి4(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసి భావి భారత శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని ఆమనగల్లు జూనియర్ సివిల్ జడ్జి కాటం స్వరూప అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని వివేకా విద్యాభారతి ఉన్నత పాఠశాలలో మంగళవారం వైజ్ఞానిక వస్తు ప్రదర్శన మేళా నిర్వహించారు. న్యాయమూర్తి ముఖ్యఅతిథిగా హాజరై టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషన్ శంకర్‌నాయక్, ఎంఈవో పాండు, సంఘసేవకుడు పాపిశెట్టి రాము, పాఠశాల కరస్పాండెంట్ గోలి శ్రీనివాసులుతో కలిసి మేళాను ప్రారంభించారు. ప్రిన్సిపాల్ మహమూద్, ఉపాధ్యాయుల బృందం పర్యవేక్షణలో విద్యార్థినీ విద్యార్థులు 30 అంశాలపై ప్రదర్శనలు ఇచ్చారు. పాఠశాలకు చెందిన 90 మంది విద్యార్థిని, విద్యార్థులచే రూపొందించిన వస్తు సామగ్రి ప్రదర్శనలు, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాన్ని చాటే బోనాలు, బతుకమ్మ, పోతురాజుల విన్యాసాలు సందర్శకులను అమితంగా ఆకట్టుకున్నాయి. సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తమ ఆలోచనలకు పదును పెడితే అద్భుతాలు సాధ్యమవుతాయని అన్నారు. ఎస్ఐ సీతారామ్‌రెడ్డి, డాక్టర్ పుల్లయ్య, ట్రస్మా నాయకులు అల్లాజీగౌడ్, శివలింగం, సుదీర్ రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, నిరంజన్, కోట్ల వెంకటేశ్, సంజీవ్ కుమార్, శ్రీనివాసులు, వెంకన్న, పాఠశాల అకడమిక్ అడ్వైజర్, ఏవీ శర్మ, ఉపాధ్యాయులు విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలు చేపట్టాలి

శంకర్‌పల్లి : విద్యార్థులు సృజనాత్మకతతో నూతన ఆవిష్కరణలకు పునాదులు వేయాలని మహాలింగపురం ఇన్‌చార్జి హెచ్‌ఎం రెహానాబేగం అన్నారు. మహాలింగపురం ఉన్నత పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. వివిధ రకాల ప్రయోగాలను ప్రదర్శించి, వాటి గురించి వివరించారు. ఉపాధ్యాయులు పెంటయ్య, రమ, శ్రీరాములు, గీతాంజలి, మల్లికార్జున్, అనుపమ, పల్లవి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



శంకర్‌పల్లి : వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు

క్రైం కార్నర్

కూతురిపై లైంగికదాడి కేసులో తండ్రికి ఏడేళ్ల జైలు

శంకర్‌పల్లి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): కన్న కూతురిపై లైంగిక దాడికి పాల్పడిన తండ్రికి 7 సంవత్సరాల జైలు శిక్ష, రూ. 20వేల జరిమానా విధిస్తూ ఎల్బీ నగర్ జిల్లా ఫాస్ట్‌ట్రాక్ స్పెషల్ పోక్సో కోర్టు న్యాయమూర్తి పద్మావతి మంగళవారం తీర్పునిచ్చారు. మోకిల సీఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన విస్లావత్ రామునాయక్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేసేవాడు. ఆయనకు భార్య, కూతురు, ఇద్దరు కుమారులున్నారు. 2018లో కూతురి(మైనర్)పై తన భర్త లైంగికదాడికి పాల్పడ్డాడని భార్య ఫిర్యాదు చేసింది. పోక్సో యాక్టు కింద కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడికి 7సంవత్సరాల జైలు శిక్ష, రూ. 20వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

రంగారెడ్డి అర్బన్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం ఉదయం మండల పరిధిలోని పులిమామిడి గ్రామంలో చోటుచేసుకుంది. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కందుకూరు పోలీసులు మీడియాకు వివరాలు వెల్లడించారు. పులిమామిడి గ్రామానికి చెందిన రెవెళ్ల యేసయ్య కుమారుడు రాకేష్ (23) ఓ కాలేజీలో డిగ్రీ చదువుతున్నాడు. ఈక్రమంలో అతడు మంగళవారం ఉదయం 8 గంటలకు ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా, అతడు ఓ అమ్మాయిని ప్రేమించాడని, ప్రేమ విఫలం కావడంతో ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి తండ్రి యేసయ్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సైదులు తెలిపారు.

అక్రమంగా ఆవుల తరలింపు

● వాహనాన్ని పోలీసులకు అప్పగించిన బీజేపీ నాయకులు

చేవెళ్ల, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : ఆవులను అక్రమంగా తరలిస్తున్న ఆటోను బీజేపీ నాయకులు అడ్డుకొని పోలీసులకు అప్పగించిన సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. బీజేపీ నాయకులు తెలిపిన వివరాల ప్రకారం.. షాబాద్ మండల పరిధిలోని సర్దార్‌నగర్ మార్కెట్ నుంచి అక్రమంగా ఆటోలో పది ఆవులను తీసుకువస్తుండగా బీజేపీ నాయకులు చేవెళ్ల పట్టణ కేంద్రంలో అడ్డుకొని పో లీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం పట్టుబడిన ఆవులను నార్సింగి పరిధిలోని కోకాపేట్‌లో ఉన్న గోశాలకు తరలించారు. చేవెళ్ల పోలీస్‌లు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వైన్‌షాపులో చోరీ.. రూ.50వేలు అపహరణ

షాబాద్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): నాగర్‌గూడలోని వైన్‌షాపులో చోరీ జరిగిన సంఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి కథనం మేరకు.. మండల పరిధిలోని నాగర్‌గూడ దుర్గాభవానీ వైన్‌షాపును నిర్వాహకులు రోజు మాదిరిగానే సోమవారం రాత్రి 10.30 గంటలకు మూసివేసి ఇంటికి వెళ్లారు. మంగళవారం ఉదయం 10.30 గంటలకు షాపు తెరిచి చూసే సరికి కౌంటర్‌లో ఉన్న రూ.50వేలు, సీసీ కెమెరా డివైజ్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. షాపు వెనకాల పరిశీలించగా దుండగులు రెండు ఫీట్ల గోడను పగులగొట్టి లోపలికి చొరబడి దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించారు. హరిబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి తెలిపారు.

పాఠశాలలో సౌకర్యాల కల్పనకు కృషి



విద్యార్థులతో అమెజాన్ సంస్థ ప్రతినిధులు

యాచారం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): పాఠశాలలో అన్ని వసతులు కల్పించి విద్యార్థులకు తోడ్పాటునందిస్తామని లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్ చీఫ్ మేనేజర్, అమెజాన్ సంస్థ ప్రతినిధి షాజీ నారాయణ్ అన్నారు. మంగళవారం మండలంలోని నందివనపర్తి ఉన్నత పాఠశాలలో తరగతి గదులకు రంగులు వేయించారు. ఫ్యాన్లు, ఇతర సామగ్రి, ల్యాబ్ ఏర్పాటుతో పాటు ల్యాప్‌ట్యాప్‌లను, ఇతర పరికరాలను సమకూర్చారు. ప్రధానోపాధ్యాయుడు వెంకటరామశాస్త్రి, కిషన్ తదితరులున్నారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటా



శ్రీనివాస్ మృత దేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నారాయణ రెడ్డి

కడ్తాల్/ఆమనగల్లు, మార్చి4(ఆంధ్రజ్యోతి): అధైర్య పడొద్దు.. అండగా ఉంటానని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి బాధిత కుటుంబానికి భరోసా కల్పించారు. మండల పరిధిలోని కర్కల్ పహాడ్‌కు చెంది న కాంగ్రెస్ నాయకుడు, కాంగ్రెస్ పార్టీ సోషల్‌మీడియా కన్వీనర్ శ్రీను అనారోగ్యంతో మృతిచెందాడు. మంగళవారం మృతదేహాన్ని ఎ మ్మెల్యే సందర్శించి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ప రామర్శించారు. రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆసుపత్రి ఖ ర్చులతో పాటు శ్రీను పిల్లల చదువులకయ్యే ఖర్చులు భరిస్తానని భరో సా ఇచ్చారు. పరామర్శించినవారిలో ఏఎంసీ చైర్‌పర్సన్ గీతా నర్సింహ, వైస్‌చైర్మన్ భాస్కర్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, ఆమనగల్లు మాజీఎంపీపీ అనితా విజయ్, వీరయ్య, వెంకోబా, విష్ణు, జంగయ్య, సంజీవ్‌యాదవ్, విక్టర్, షాబొద్దీన్, అర్జున్, యాదగిరిరెడ్డి, బాబా, బీచ్యానాయక్, తదితరులున్నారు.

అర్హులైన పేదలందరికీ పథకాల వర్తింపు

కాంగ్రెస్ ప్రజా పాలనలో ప్రతి ఒక్కరికీ మేలు జరుగుతుందని ఎమ్మెల్యే నారాయణరెడ్డి అన్నారు. అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు రేషన్ కార్డులు, ప్రభుత్వ పథకాలు అందించడం జరుగుతుందన్నారు. ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి మండలాల్లో మంగళవారం ఎమ్మెల్యే పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. లబ్దిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. గ్రామాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి నాయకులు ఎమ్మెల్యేకు వినతి పత్రాలు అందజేశారు. గ్రామాల సర్వతోముఖాభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పథకాలు రూపొందించి అమలు చేస్తుందని ఎమ్మెల్యే చెప్పారు. నాయకులు యాట నర్సింహ, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, యాదయ్య, భట్టు కిషన్ రెడ్డి, బాబా, హన్మనాయక్, విజయ్‌రాథోడ్, మిట్టపల్లి అంజయ్య, నరేశ్‌నాయక్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణ సంఘం మండలాధ్యక్షుడిగా విష్ణు



నియామక పత్రం ఇస్తున్న నాయకులు

తలకొండపల్లి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): నా యీ బ్రాహ్మణ సేవా సంఘం తలకొండపల్లి మండలాధ్యక్షుడిగా నీలకంఠ విష్ణు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం మండల కేంద్రంలో నాయీబ్రాహ్మణ సేవా సంఘం సమావేశం నిర్వహించారు. సమస్యలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. అనంతరం నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నీలకంఠ విష్ణు, గౌరవాధ్యక్షులుగా నీలకంఠ చెన్నకేశవులు, ఉపాధ్యక్షులుగా శేఖర్, ప్రధాన కార్యదర్శిగా చంద్రశేఖర్, కోశాధికారిగా రమేశ్, ప్రచార కార్యదర్శిగా వెంకటేశ్, సభ్యులుగా పర్వతాలు, భిక్షపతి, మహేశ్, సత్యనారాయణ, శివ, వెంకటేశ్, జగన్, రమేశ్, ప్రవీణ్‌లు ఎన్నికయ్యారు. కమిటీని సంఘం నాయకులు సత్కరించి అభినందించారు.